9

సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం : 27 : ఆగస్టు : 2025



జైజై.. గణేశా..

నవరాత్రి ఉత్సవాలకు విచ్చేస్తున్న పార్వతీ తనయుడు

ఊరూరా.. వాడవాడలా కొలువుదీరేందుకు బొజ్జ గణపయ్య సిద్ధమయ్యాడు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన భారీ మండపాల్లో తీరొక్క ఫలహారం.. ఉండ్రాళ్ల నైవేద్యం.. భజనలు తదితర కార్యక్రమాలతో తొమ్మిది రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈసారి మట్టి విగ్రహాలను ఎక్కువగా ప్రతిష్ఠిస్తున్నారు. బుధవారం వినాయకచవితి సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– స్టేషన్ మహబూబ్‌నగర్

- ఊరూ.. వాడలో ముస్తాబైన మండపాలు
- నేడు కొలువుదీరనున్న గణనాథుడు



మహబూబ్‌నగర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న చిన్నచిన్న గణపతి విగ్రహాలు



సమావేశంలో మాట్లాడుతున్న మద్ది యాదిరెడ్డి

ఏ పూజలోనైనా తొలుత పూజలందుకునే ప్రథమ దైవం వినాయకుడు. గణేశుడి ఆకారం ఓం కారానికి ప్రతిరూపమని, గణేశుడి రూప అలంకారాలన్నీ ప్రకృతిని ప్రతిబింబిస్తూ ఉంటాయని పెద్దలు చెబుతారు. ఉత్సవాల సందర్భంలో వినాయకుడు ధరించని రూపముండదు. ఎత్తని అవతారముండదు. అన్ని దేవతా రూపాల్లో, దేశ నాయకుల రూపాల్లో, వివిధ ఆకారాల్లో, ఎత్తుల్లో, రంగుల్లో దర్శనమిస్తూ ఆబాలగోపాలాన్ని అలరిస్తాడు. జిల్లా వ్యాప్తంగా వినాయక చవిత పండుగ వాతావరణం కనిపిస్తోంది. ఈ ఏడాది కూడా భారీ స్థాయిలో గణనాథుల మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణంపై విస్తృతంగా ప్రచారం చేయడంతో పెద్ద పెద్ద మండపాల నిర్వాహకులు సైతం మట్టిగణపయ్యకే జై కొడుతున్నారు. మంగళవారం ఎనుగొండ, శ్రీనివాస్‌కాలనీలలోని గణేశ్ ప్రతిమ తయారీ కేంద్రాల వద్ద బారులుతీరారు. యువకులు, పిల్లలు, మండపాల నిర్వాహకులు డప్పుల శబ్దాలతో గణనాథులను వాహనాల్లో తీసుకెళ్లారు. క్లాక్‌టవర్, పాన్ చౌరస్తా, అశోక్ టాకీస్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో జనంతో కిక్కిరిసిపోయాయి. నవరాత్రులకు సంబంధించిన పూజాసామగ్రి కొనుగోలు కోసం ఎగబడ్డారు.

ఘనంగా నిర్వహించుకుందాం..

వినాయక ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని గణేశ్‌భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠించాలని, వచ్చే నెల 5వ తేదీన నిమజ్జనం చేయాలని కోరారు. మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు చేపట్టాలని కోరారు. వర్షకాలం కావడం వల్ల నీళ్లు రాకుండా మండపాల పైకప్పును ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి మండపం వద్ద గౌరవప్రదమైన స్థలంలో కాషాయ ధ్వజం పెట్టుకోవాలన్నారు. చిన్నారుల్లో ధర్మం, దేశం పట్ల అవగాహన పెంచుట కోసం ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా సందర్శిస్తారని తెలిపారు. 28న సనాతన ధర్మం దాని ఔన్నత్యం, 29న మన భారత దేశం విశ్వగురు కావడంలో యువత పాత్ర, 30న గోపూజ, భక్తిగీతాలు, 31న భజన బృందాల కార్యక్రమం, వచ్చేనెల 1న రామాయణంలో నేను గ్రహించిన నీతి అనే అంశంపై పోటీలు నిర్వహించాలని, అలాగే ప్రతి రోజు హనుమాన్‌చాలీసా, సహస్రనామ స్తోత్రాల పఠనం చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు నాగరాజు, విగ్నేష్, లక్ష్మణ్, మాల్యాద్రిరెడ్డి, భాస్కర్, గుబ్బ భరత్, శ్రీధర్ బాబు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

1940లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తి రగిల్చేలా..

- 85 ఏళ్లుగా కొనసాగుతున్న ఉత్సవాలు

జడ్చర్ల టౌన్: స్వాతంత్ర్య ఉద్యమస్ఫూర్తి కోసం బాలగంగాధర్ తిలక్ ఇచ్చిన పిలుపుతో బాదేపల్లి పట్టణం ప్రస్తుతం గణేశ్‌మందిరంలో 1940లో తొలిసారిగా వినాయక ఉత్సవాలు ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు 85 ఏళ్లుగా ప్రతి ఏటా వినాయక ఉత్సవాలను నిరాటంకంగా కొనసాగిస్తూనే ఉన్నారు. నాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న గుండప్ప, కొత్త కేశవులు, జంగయ్యయాదవ్, పెరుమాళ్ల వెంకట్‌రెడ్డిలతో పాటు మరికొందరు కలసి 1940లో రేకుల్‌షెడ్ వేసి అందులో మట్టి వినాయకుడిని ఏర్పాటుచేశారు. ఉత్సవ విగ్రహంతో పాటే అక్కడే పాలరాతి వినాయక విగ్రహాన్ని సైతం ప్రతిష్ఠించారు. స్వాతంత్ర్యం వచ్చే వరకు అక్కడే సమావేశాలు నిర్వహించుకునేవారు. ఎవరైనా తనిఖీలకు వచ్చినట్లయితే భజనలు, కీర్తనలు పాడుతుండేవారు. అలా స్వాతంత్ర్యం సిద్ధించాక నిజాం పాలన నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు ఉత్సవాలను కొనసాగించారు. ప్రారంభంలో ఊరంతా ఇక్కడికే వచ్చి ఉత్సవాల్లో పాలుపంచుకునేవారు. ప్రస్తుతం గల్లీగల్లీకో గణనాథుడు వెలుస్తున్నప్పటికీ.. నిమజ్జనం సమయంలో ఈ గణేశ్ మందిరం వినాయకుడికే ప్రముఖ స్థానం ఇస్తున్నారు.



1940లో ప్రతిష్ఠించిన పాలరాతి గణపతి విగ్రహం

పాతపాలమూరు @ 68 ఏళ్లు

- ఈసారి శివుడి రూపంలో భారీ గణనాథుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని పాతపాలమూరు వినాయక ఉత్సవాలు ప్రత్యేకత చాటుకుంటోంది. జైల్‌ఖానా సమీపంలో శ్రీశివరామాంజనేయ భక్తసమాజం ఆధ్వర్యంలో ప్రతిష్ఠిస్తున్న గణేష్ ఉత్సవాలకు 68 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉంది. శివరామాంజనేయస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠిస్తున్నారు. ఈ ఏడాది హైదరాబాద్ ధూల్‌పేటలోని దేశ్‌రాజ్‌సింగ్ కళాకార్ రూపొందించిన శివుడి రూపంలో ఉన్న 27 అడుగుల గణనాథుడిని ఏర్పాటు చేయనున్నారు. ఒక చేతిలో ఢమరుకం, మరో చేతిలో త్రిశూలం, పులి చర్మం ధరించిన వినాయకుడి రూపం ఉంది.



ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

శివరామాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈసారి కూడా ఎంతో వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. అన్నదాన కార్యక్రమాలతో పాటు తొమ్మిదిరోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. గణపతి లడ్డూ ప్రసాదాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కొన్నేళ్ల నుంచి లక్కిడిప్ నిర్వహిస్తున్నాం. నిమజ్జనం రోజు లక్కిడిప్‌లో గెలుపొందిన విజేతకు సన్మానం చేసి 51 కిలోల లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తాం.

– గోరంట్ల మాల్యాద్రిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు

వినాయకుడి సేవలో.. విఘ్నాలు కొనితెచ్చుకోవద్దు!

- మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు తప్పనిసరి
- పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందే
- ప్రమాదాలకు ముందు జాగ్రత్తే మేలు
- పోలీస్‌శాఖ అనుమతి పొందిన మండపాలు 1,044

మహబూబ్‌నగర్ క్రైం: వినాయక చవితి వచ్చిందంటే చాలు.. గల్లీ గల్లీలో సందడి నెలకొంటుంది. ఈ నవరాత్రుల్లో ఉన్నంత హడావిడి మరెప్పుడూ కనిపించదు. పిల్లలు..పెద్దలు..మహిళలు ఇలా అందరూ కలిసి సంబురంగా ఈ వేడుకలు నిర్వహిస్తారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా గణేశ్ మండపాల సంఖ్య ఐదువేలు దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గతేడాది చోటు చేసుకున్న ఘటనలు ఈసారి తిరిగి చోటు చేసుకోకుండా అప్రమత్తం అవ్వాల్సి ఉంది. ప్రత్యేకించి పోలీసుల సూచన మేరకు మండపాలు అనుమతి తీసుకోవడం మొదలు వారి కనుసన్నల్లో ముందుకు సాగాలి. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనానికి సహకరిస్తే నవరాత్రులు సంతోషం ఏడాదంతా ఉంటుంది.



జిల్లా కేంద్రంలో గణనాథుడిని తీసుకెళ్తున్న యువకులు

పోలీస్‌స్టేషన్	మండపాల దరఖాస్తులు
సీసీకుంట	53
దేవరకద్ర	125
భూత్పూర్	47
మూసాపేట	44
అడ్డాకుల	67
బాలానగర్	103
మిడ్జిల్	53
రాజాపూర్	111
మ.నగర్ రూరల్	80
హన్వాడ	84
మహమ్మదాబాద్	39
కోయిలకొండ	55
నవాబ్‌పేట	56
వన్‌టౌన్	73
టూటౌన్	31
జడ్చర్ల	23

అనుమతి ఇలా పొందాలి..

వినాయక ఉత్సవాల మండపాలను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలి. మండపాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వాహకుల పూర్తి వివరాలు(నిర్వాహకుల పేర్లు, మండపం నిర్మిస్తున్న ప్రదేశం, విగ్రహం ఎత్తు, మైకు అనుమతి తదితర అంశాలపై తమ పరిధి పోలీస్‌స్టేషన్ అధికారి వద్దకు వెళ్లి లిఖితపూర్వకంగా వివరాలు తెలపాల్సి ఉంటుంది). అనుమతి కోరుతూ వారికి దరఖాస్తు అందిస్తే అక్కడి నుంచి డీఎస్పీకి పంపుతారు. డీఎస్పీ చివరగా అనుమతి ఇవ్వాలా? వద్దా? అనేది నిర్ణయిస్తారు. పూర్తి అనుమతి వచ్చిన తర్వాతనే మండపం ఏర్పాటు చేయాలి. మండపం ఏర్పాటే చేసే వారు రోడ్డుని పూర్తిగా ఆక్రమించకుండా జాగ్రత్త పడాలి. పోలీస్‌శాఖ నిర్ణయించిన సమయంలోపే కార్యక్రమాల్ని ముగించాల్సి ఉంటుంది. భారీ ప్రతిమలు ఏర్పాటు చేసిన షెడ్డుల వద్ద వరుసగా జనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.

- వినాయకుడి మండపాలను నిర్మించే సమయంలో సామాన్యులకు ఇబ్బంది కలగకుండా చూడాలి. రోడ్డు మధ్యలో మండపాలు నిర్మిస్తే వాహనాల రాకపోకలకు, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి. రోడ్డు పక్కనే ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టాలి. మండపాల వద్ద అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. విద్యుత్ తీగలకు ఎలాంటి అతుకులు లేకుండా నాణ్యమైనవి వాడాలి. మండపాల వద్ద విద్యుత్ కోసం తప్పనిసరి అనుమతి తీసుకోవాలి.
- వినాయక నవరాత్రి ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపంలో అప్రమత్తంగా ఉండాలి. తొమ్మిది రోజుల పాటు మండపంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఏదైనా అత్యవసరమైనా, ఘటన జరిగినా ఆలస్యం చేయకుండా సంబంధిత శాఖకు సమాచారం అందించాలి.
- నవరాత్రి ఉత్సవాల్లో భక్తి, గీతాలు భజనలు, మంత్రోచ్ఛారణలు, పూజలు తప్పనిసరి, పూజలు జరుగుతున్న సమయంలో వేద మంత్రాలు స్థానికులు, డీజేలు, భారీ స్పీకర్లు ఏర్పాటు చేస్తుంటారు. జిల్లాకేంద్రంలో డీజేలకు అనుమతి లేదు. స్పీకర్లు, మైకు ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి. కేవలం పూజ జరిగే సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మైకులను వాడుకొని తర్వాత నిలిపివేయాలని పోలీసులు సూచిస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత పూర్తిగా ఆపివేయాలని చెబుతున్నారు.
- మండపాలను నాణ్యమైన వస్తువులతో నిర్మించుకోవాలి.
- సత్ప్రవర్తన కలిగిన వలంటీర్లను నియమించుకొని భక్తులను క్రమబద్ధీకరించేలా చూసుకోవాలి. మండపాల వద్ద టపాసులు, ఇతర పేలుడు పదార్థాలు ఉంచకూడదు. 24 గంటలూ వలంటీర్లు ఉండే ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలి.
- ఒక డ్రమ్‌లో నీరు నింపి ఉంచుకోవాలి, రెండు బకెట్లలో ఇసుక నింపి ఉంచుకోవాలి.
- నిమజ్జనానికి ముందు శాంతి కమిటీ సమావేశంలో పోలీసులు, అధికారులు సూచించిన అంశాలను విధిగా పాటించాలి.
- జిల్లాలో నిమజ్జన చెరువులు, కుంటలు, నదులు లోతుగా ఉంటాయి. ఎక్కువ లోతుకు వెళ్లకపోవడం మంచిది. క్రేనుపై నిమజ్జనం చేసే భక్తులు చాలా జాగ్రత్తగా ఉండాలి.
- ఊరేగింపులో విద్యుత్ తీగలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. ముందే సరఫరా నిలిపివేసేలా ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వాలి.

ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దు



సీసీ కెమెరాలతో పాటు పోలీస్ పికెటింగ్, మొబైల్ పెట్రోలింగ్ ద్వారా నిత్యం పర్యవేక్షణ ఉంటుంది. ప్రతి మండపాన్ని పోలీసులు రాత్రివేళ తనిఖీ చేస్తుంటారు. మద్యం తాగడం, పేకాట ఆడటం వంటివి చేయరాదు. సామాన్యులు ఇబ్బంది పడకుండా మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. రోడ్లను ధ్వంసం చేస్తూ రోడ్ల మధ్యలో మండపాలను ఏర్పాటు చేస్తే ఇబ్బందిగా ఉంటుంది. మండపాల వద్ద సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. చట్ట ప్రకారం డీజేలకు అనుమతి లేదు. ఇతర మతాలకు సంబంధించిన ప్రార్థన మందిరాల వద్ద ఎక్కువ సమయం నృత్యాలు చేయరాదు. ప్రతి మండపం దగ్గర ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సింగల్ మైక్‌కు అనుమతి ఇస్తాం.

– డి.జానకి, ఎస్పీ

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పక్కన ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

- అధిక ధరలకు అమ్మినా డీలర్‌పై కేసుల నమోదు
- విక్రయాలపై కలెక్టర్లు, ఎస్పీలు నిశితంగా పర్యవేక్షించాలి
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వ్యవసాయ సీజన్ పూర్తయ్యే వరకు యూరియా సరఫరాపై కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేకంగా దృష్టిసారించి నిశితంగా పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో జిల్లాల వారీగా యూరియా లభ్యత, సరఫరా, ఇండెంట్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎరువులు, యూరియా సరఫరాలో ఎలాంటి అవకతవకలు జరిగినా.. దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా సదరు డీలర్లపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా పంపిణీ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయని, వాస్తవంగా కేంద్రం నుంచి 9 లక్షల మె.ట., యూరియా రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 5.72 మె.ట., మాత్రమే వచ్చిందని ఇంకా సుమారు 3 లక్షల మె.ట., రావాల్సి ఉందన్నారు. కొన్ని ప్రైవేటు షాపులలో ఎక్కువ రేటుకు విక్రయిస్తూ ఇతర అనవసరమైన ఎరువులు అంటగడుతున్నారని, అలాంటి వాటిని సీజ్ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ సీజన్ ముగిసే వరకు ప్రతి ఎరువుల షాప్, పీఏసీఎస్, ఆగ్రో సేవా కేంద్రాలు, ఒక్కొక్క షాప్ వద్ద ఒక అధికారిని నియమించి పర్యవేక్షించేలా చూడాలన్నారు. నానో యూరియా వాడకం– ప్రయోజనాల గురించి కూడా వ్యవసాయ అధికారులు రైతులకు వివరించాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్లు విజయేందిర, సిక్తా పట్నాయక్, బదావత్ సంతోష్, ఆదర్శ్ సురభి, బీఎం సంతోష్, ఎస్పీలు జానకి, ఎస్పీ యోగేష్ గౌతమ్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, రావుల గిరిధర్, శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో వరి సాగు మిగతా వాటితో పోలిస్తే ఎక్కువగా నాటు వేశారని, ఈ క్రమంలోనే రైతులు ఎక్కువ మొత్తంలో యూరియా కొని నిల్వ చేసుకుంటున్నారని చెప్పారు.
- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ రైతులు యూరియా వస్తలేదని ఆందోళన చెందుతున్నారని, వచ్చిన యూరియాను శాస్త్రీయంగా వాడితే సరిపోతుందని దీనిపై రైతులకు ఆవగాహన కల్పించాలని చెప్పారు.
- నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ యూరియా సరఫరాలో లోడు సమయానికి రావడం లేదని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే అధికారులు యూరియా సరఫరా నిశితంగా పర్యవేక్షణ చేయాలన్నారు.
- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియాపై అధికారులు పర్యవేక్షించి సక్రమంగా సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి దేవరకద్ర, ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి యూరియాను కొనుగోలు చేస్తారని, కాబట్టి ఇక్కడి ఎరువుల దుకాణాలకు ఎక్కువ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని వెల్దండ, ఊర్కొండ మండలాలకు యూరియా ఎక్కువ సరఫరా చేయాలని సమావేశం దృష్టికి తెచ్చారు.

107 మందికి పదోన్నతులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న అర్హులైన సీనియర్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఇందుకు సంబంధించిన ఆర్డర్ కాపీలను అధికారులు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేసి.. ఉపాధ్యాయులకు సైతం చేరేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆర్డర్స్ తీసుకున్న ఉపాధ్యాయులు గురు, శుక్ర వారం లోగా వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంది. సబ్జెక్టుల వారీగా పదోన్నతులు పొందిన వారు స్కూల్ అసిస్టెంట్లుగా ఐదుగురు గణితం, ఆరుగురు ఫిజికల్ సైన్స్, 12 మంది బయోసైన్స్, 25 మంది సోషల్, నలుగురు ఇంగ్లిష్, పది మంది తెలుగు, 11 మంది హిందీ, ఐదుగురు ఫిజికల్ ఎడ్యుకేషన్, 22 మంది ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఉర్దూకు సంబంధించి ఏడుగురు ఉన్నారని డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు



నవాబుపేటలో యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

నవాబుపేట/భూత్పూర్: వారం పది రోజులుగా ప్రతి రోజూ వస్తున్నా.. యూరియా దొరకడం లేదనే ఆగ్రహంతో మంగళవారం జిల్లాలో భూత్పూర్, నవాబుపేట, మూసాపేట మండల కేంద్రాల్లో అన్నదాతలు రోడ్డెక్కారు. భూత్పూర్‌లో రైతులు రాస్తారోకో చేయడంతో సీఐ రామకృష్ణ ఫోన్ చేసి మండల వ్యవసాయాధికారి మురళీధర్‌ను పిలిపించారు. బుధవారం లోగా యూరియా ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. నవాబుపేటలోని అంబేద్కర్ చౌరస్తా, ఎర్రసత్యం చౌరస్తాలో రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. దాదాపు మూడు గంటల పాటు కొనసాగింది. ఈ సందర్భంగా ముందస్తు ప్రణాళిక లేకపోవడం, అసమర్థ ప్రభుత్వం వల్ల యూరియా కొరత ఏర్పడిందని విమర్శించారు.తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ విక్రమ్ సంఘటన స్థలానికి చేరుకుని కలెక్టర్‌తో మాట్లాడి.. రోజుకు రెండు లారీల చొప్పున యూరియా అందించేలా హామీ ఇప్పించడంతో రైతులు ఆందోళన విరమించారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, నర్సింహులు, లక్ష్మయ్య, శ్రీనివాస్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్లు పెంచలేకపోతే రాజీనామా చెయ్

జడ్చర్ల టౌన్: వికలాంగులకు పింఛన్ రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పింఛన్లు రూ.4వేలకు పెంచాలని, అలా పెంచటం చేతకాకపోత రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సాలెహా ఫంక్షన్‌హాల్లో వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పింఛన్‌దారుల ఆధ్వర్యంలో నిర్వహించిన జడ్చర్ల నియోజకవర్గ సన్నాహక సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. పింఛన్‌లు పెంచి ఇస్తానని చెప్పి ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. పింఛన్లు పెంచటం చేతకాకుంటే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో లక్షలాదిమందితో మహాగర్జన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు టీకే నర్సింహ, ప్రధాన కార్యదర్శి నరేందర్, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు గడ్డం యాదయ్య, సావిత్రి రంగా, వీహెచ్‌పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, తిరుపతమ్మ, చిన్న అంజయ్య, జంగయ్య, రాములు, గోపాల్, పద్మ, రఫీక్‌లు ఉన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

భూమిని వెనక్కి తీసుకుంటాం

- పీయూలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన వీసీ శ్రీనివాస్
- రెండు, మూడ్రోజుల్లో హద్దురాళ్లు పాతుతామని స్పష్టీకరణ

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం అధికారులు 500 గజాల భూమి కేటాయించడం, ట్రాన్స్‌కో అధికారులు కేటాయించిన దాని కంటే ఎక్కువ భూమిని చదును చేయడంతో వివాదం నెలకొంది. ఈ విషయమై 'సాక్షి'లో మంగళవారం 'పీయూలో సబ్‌స్టేషన్ వివాదం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై మంగళవారం ఉదయం విద్యార్థి సంఘాల నాయకులు పీయూ ముఖద్వారం వద్ద గంటసేపు నిరసన చేపట్టారు. పలువురు విద్యార్థి సంఘాల నాయకులు వెంటనే భూములను వెనక్కి తీసుకోవాలని, ట్రాన్స్‌కో అధికారులు కట్టిన ప్రహరీని కూల్చివేయాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కేటాయించిన భూమి కంటే ఎక్కువ వినియోగించుకుంటే వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు వైస్ చాన్స్‌లర్ నుంచి స్పష్టమైన హామీ కావాలని పట్టుబట్టి అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట బైఠాయించారు. రిజిస్ట్రార్ రమేష్‌బాబు కూడా విద్యార్థి సంఘాల నాయకులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా వినిపించుకోలేదు. దీంతో వీసీ శ్రీనివాస్ బయటకు వచ్చి విద్యార్థులకు వివరణ ఇచ్చారు. కేటాయించిన భూమికంటే ఎక్కువ భూమిని వారు చదును చేశారని తెలిసిన వెంటనే నోటీసులు ఇచ్చామని, దీనికి వివరణ ఇవ్వాల్సి ఉందన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో ఎక్కువగా వినియోగించిన భూమిని తిరిగి తీసుకుంటామని, కేటాయించిన భూమి వరకు హద్దులు నిర్ణయిస్తామని వీసీ పేర్కొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ దగ్గరకు వెళ్లి ఎక్కడి వరకు భూమి కేటాయించారు.. ఎక్కడి వరకు చదును చేశారు.. అని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఆయా సంఘాల నాయకులు కార్తిక్, రాము, గణేష్, తాయప్ప, రాజేష్, శ్రీను, ఆంజనేయులు, శివ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీసీ శ్రీనివాస్, అధికారులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


జంగయ్య (ఫైల్)

వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్ సమీపంలో హైదరాబాద్‌–శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం కుప్పగండ్ల గ్రామానికి చెందిన అయిల జంగయ్య(60) అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. జంగయ్య గ్రామంలో కిరాణ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం షాపులోకి సామగ్రి తీసుకురావడానికి ద్విచక్ర వాహనంపై వెల్దండకు బయలుదేరాడు. మార్గమధ్యలో పెద్దాపూర్ బస్‌స్టేజి సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో జంగయ్యకు తీవ్ర గాయలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని జంగయ్యను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్దండ ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

వెయ్యి లీటర్ల డీజిల్ అపహరణ

● లారీల ట్యాంకుల నుంచి మాయం

చారకొండ: ప్రధాన రహదారి పక్కన ఆపిన లారీల నుంచి దాదాపుగా వెయ్యి లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అపహరించిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. దీంతో లారీలు అక్కడికక్కడే ఆగిపోయాయి. లారీ డ్రైవర్లు తెలిపిన వివరాలు.. సూర్యాపేట్ నుంచి రాయచూర్‌కు వరిధాన్యం లోడుతో వెళ్తున్న 3 లారీలు మండల కేంద్రం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆపి సోమవారం రాత్రి పడుకున్నారు. ఉదయం లేచి చూసేసరికి డీజిల్ ట్యాంకులకు మూతలు తెరచి ఉండటంతో పరిశీలించగా ట్యాంకులు ఖాళీగా కనిపించాయి. మూడు లారీల్లో రూ.95 వేల విలువ గల డీజిల్ అపహరించడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డ్రైవర్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగకు రిమాండ్

మక్తల్: అంతర్రాష్ట్ర దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మక్తల్ సీఐ రాంరాల్, మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డిలు మంగళవారం విలేకర్లకు తెలిపారు. నిందితుడు జూలై 11న మక్తల్ టీచర్స్ కాలనీలో భూత్పుర్ పవన్‌కుమార్ ఇంట్లో అర్ధరాత్రి చొరబడి తాళం విరగొట్టి బంగారం, వెండి ఆభరణాలు, రూ.30 వేలు చోరీ చేశాడు. జనవరి 22న మక్తల్ యల్లమ్మకుంటలో అనిత ఇంటి తాళం విరగొట్టి బంగారం, వెండి వస్తువులు రూ.52 వేల నగదు దొంగిలించాడు. రెండు చోట్ల ఆంధ్రప్రదేశ్ అనంతపూర్ జిల్లా కల్యాణదుర్గం మండలం తూర్పు కోడుపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి ప్రశాంత్ కుమార్ అలియాస్ శ్రీనివాస్ చోరీకి పాల్పడ్డాడు. తాళం వేసి ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనానికి పాల్పడుతున్నాడు. రెండు రాష్ట్రాల్లో వివిధ పోలీస్‌స్టేషన్లలో అతనిపై దాదాపు 30 నుంచి 40 కేసులు నమోదయ్యాయి. ఎరుకలి ప్రశాంత్‌కుమార్ మక్తల్‌లో బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా మక్తల్ పోలీసులు పట్టుకోని విచారించారు. మేస్త్రీ పనికి వెళ్తూ జీవనం గడుపుతున్నట్లు తెలిపాడు. కూలీ డబ్బులు సరిపోకపోవడంతో చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నాడు. ఇప్పటి వరకు 13 కేసులు మహబూబ్‌నగర్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలో ఉన్నట్లు తెలిపారు. నిందితుడితో రూ.5.27లక్షలు, వస్తువులు రికవరీ చేసి కేసు నమోదు చేశారు. మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, మక్తల్ ఏఎస్‌ఐ శంకరయ్య, సిబ్బంది అశోక్, నరేష్, శ్రీకాంత్‌లను సీఐ అభినందించారు. మంగళవారం మక్తల్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మక్తల్ సీఐ రాంలాల్ తెలిపారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి: సీఐటీయూ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దివిటిపల్లి ఐటీ పార్కులోని అమరరాజా గిగా ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి కోరారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో అక్కడికి వెళ్లి సర్వే చేయగా ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రస్తుతం అందులో బ్యాటరీల ప్యాకింగ్ నడుస్తోందని, సుమారు 500 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. మస్టర్, నాన్ మస్టర్, టెక్నికల్, నాన్ టెక్నికల్, స్కిల్డ్, అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ తదితర పేరిట ఇతర రాష్ట్రాలకు చెందిన వారినే ఎక్కువగా యాజమాన్యం నియమించుకుందని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పేరుతో 94 రోజుల పాటు ఇక్కడ శిక్షణ ఇస్తున్నా.. మళ్లీ శిక్షణ కోసమంటూ ఏకంగా బెంగళూరు, చెన్నై, తిరుపతి, విశాఖపట్టణం, హైదరాబాద్‌కు కార్మికులను తీసుకెళుతున్నారన్నారు. ముఖ్యంగా 18–30 ఏళ్లలోపు వారికే ప్రాధాన్యం ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. అతి తక్కువ వేతనాలు (రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు) మాత్రమే ఇస్తున్నారన్నారు. ఆల్ట్‌మెన్, లోహం ఎనర్జీ పరిశ్రమలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయన్నారు. వాటిని త్వరితగతిన పూర్తి చేసి మహబూబ్ నగర్, ఎదిర, ఏనుగొండ, దివిటిపల్లి, సిద్దాయపల్లి, అమిస్తాపూర్‌కు చెందిన యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ అంశాలపైనే ఈనెల 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

వైకుంఠవాసుడికి ఏరువాడ జోడు పంచెలు


శ్రీవారి పంచెను నేస్తున్న చేనేత కార్మికులు

● 41 రోజులుగా నిష్ఠతో పంచెలు నేసిన కార్మికులు
● గద్వాల సంస్థానాదీశుల కాలం నుంచే కొనసాగుతున్న ఆనవాయితీ
● రేపు టీటీడీ అధికారులకు అందజేత


శ్రీవారి మూలవిరాట్‌కు ధరింపజేసే ఏరువాడ జోడు పంచెలు

గద్వాలటౌన్: గద్వాల సంస్థానాదీశుల కాలం నుంచి తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు గద్వాల ఏరువాడ జోడు పంచెలను అందజేయడం సాంప్రదాయంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గద్వాలలో చేపట్టిన శ్రీవారి ఏరువాడ జోడు పంచెల నేత ఇటీవల పూర్తయింది. సెప్టెంబర్ 24వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు జరిగే దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శ్రీవారి అలంకరణకు గద్వాల ఏరువాడ జోడు పంచెలను ధరింపజేస్తారు. గద్వాల సంస్థానాదీశుల్లో ఒకరైనా రాజవంశీయులు రాజా కృష్ణరాంభూపాల్, పంచెల తయారీదారుడు మహంకాళీ కర్ణాకర్ తిరుపతికి చేరుకున్నారు. ఈ నెల 28న జోడు పంచెలను టీటీడీ అధికారులకు అందజేయనున్నారు.

ప్రత్యేకంగా నామాల మగ్గాలపై

ఏరువాడ జోడు పంచెలు 11 గజాల పొడవు, రెండున్నర గజాల వెడల్పు, 15 అంగుళాల వెడల్పుతో అంచు ఉంటుంది. పంచెలపై ఎనిమిది కోటకొమ్ములు ఉంటాయి. ఒక్కొక్క పంచె తయారీకి దాదాపు 20 రోజుల సమయం పడుతుంది. జోడు పంచెలను స్థానిక లింగంబాగ్ కాలనీలోని మహంకాళీ కర్ణాకర్ నివాసంలో ప్రత్యేకంగా నిర్మించిన నామాల మగ్గంపై నలుగురు నేత కార్మికులు ప్రత్యేక నిష్ఠ, భక్తి శ్రద్ధలను పాటిస్తూ సిద్ధం చేశారు. పంచెల తయారీలో కార్మికులు గద్దె మురళి, సాక సత్యన్న, దామర్ల శణ్ముఖరావు, మ్యాడం రమేష్ పాల్గొన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా



తిరుమల తిరుపతి వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల సందర్భంగా గద్వాల సంస్థానాదీశులు అందించే ఏరువాడ జోడు పంచెలను మూల విరాట్‌కు ధరింపజేయడం ఆనవాయితీగా కొనసాగుతుంది. మా వంశీయులు ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నందుకు గర్వపడుతున్నాం. ఈ ఏడాది నా చేతుల మీదుగా స్వామికి జోడు పంచెలను అందించడం అదృష్టంగా భావిస్తున్నా. – రాజా కృష్ణరాంభూపాల్, గద్వాల రాజ వంశీయులు

వారసత్వంగా పంచెల సమర్పణ

శతాబ్దాలుగా గద్వాల సంస్థానాదీశులు సంప్రదాయంగా వేంకటేశ్వరుడికి ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలకు గద్వాల ఏరువాడ జోడు పంచెలను అందజేస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవాల మొదటి రోజు విజయ దశమినాడు మూలవిరాట్‌కు ధరింపజేస్తారు. గద్వాల సంస్థానాదీశుల్లో ఒకరైన రాజా సీతారాంభూపాల్ వంశస్తుల ఇష్టదైవమైన వేంకటేశ్వరుడికి పంచెలను సమర్పించడాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి శ్రీవారికి అందుతున్న ఏకైక కానుక ఏరువాడ జోడు పంచెలు కావడం విశేషం.

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం


ముదిరెడ్డిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై రైతు రవినాయక్ మృతదేహం వద్ద బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

● సకాలంలో వైద్యం అందించలేని అసమర్థ పాలన
● మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ధ్వజం
● రైతు మృతదేహంతో జాతీయ రహదారిపై ఆందోళన

జడ్చర్ల: రైతుల సమస్యలు పట్టించుకోకుండా ఆత్మహత్యలకు ప్రభుత్వం కారణమవుతోందని మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని ఈర్లపల్లి తండాకు చెందిన రైతు విస్లావత్ రవి నాయక్(42) అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం రైతు రవి మృతదేహాన్ని ఇంటికి తరలిస్తూ మార్గమధ్యలో ముదిరెడ్డిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై రైతు కుటుంబానికి మద్దతుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదలేసిందని, రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు సకాలంలో యూరియా, ఎరువులు అందించలేని దుస్థితిలో సర్కార్ కొనసాగుతుందన్నారు. ఏ ఆస్పత్రికి వెళ్లినా రెఫర్ చేసి చేతులు దులిపేసి ప్రాణాలు తీస్తున్నారని ఇలాంటి కోవలోనే రైతు రవినాయక్ ప్రాణాలు కోల్పోయాడని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని మండిపడ్డారు. జడ్చర్ల వంద పడకల ఆస్పత్రిలో వైద్య సిబ్బందిని నియమించాలని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినా స్పందన లేదన్నారు. సరైన వైద్యం అందించలేని వైద్యసిబ్బందిపై చర్యలు చేపట్టాలని, రైతు కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, నాయకులు కొండల్, శ్రీకాంత్, శ్రీశైలం, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

అప్పు తీర్చలేకే ఆత్మహత్యకు పాల్పడ్డాడు

జడ్చర్ల: వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక తన భర్త ఇస్లావత్ రవినాయక్ (42) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని బాధిత రైతు భార్య నీల మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమకున్న ఎకరన్నర పొలంతో పాటు కైలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేయగా సాగు చేసిన పత్తి పంట తీవరంగా దెబ్బతీసిందని అంతకుముందుకు మూడు బోర్లు వేయగా చుక్కనీరు రాలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. తమకు బ్యాంకులో పంట రుణం రూ.90 వేలతో పాటు ప్రైవేట్‌గా తీసుకువచ్చిన రూ.8 లక్షలు అప్పుగా ఉన్నట్లు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

పచ్చదనం కనుమరుగు!


డివైడర్‌పై చెట్లను నరికివేసిన తీరు..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో వాల్టా చట్టానికి కొందరు వ్యక్తులు తూట్లు పెట్టారు. అధికారుల అనుమతి తీసుకోకుండా ఏకంగా సుమారు 50 చెట్లను నరికివేశారు. వాస్తవానికి 2021లో 'హరితహారం' కింద మున్సిపల్ అధికారులు స్థానిక పద్మావతికాలనీ కామన్ నుంచి కృష్ణా టెంపుల్ వెళ్లే దారిలో డివైడర్‌పై కోనోకార్పస్ మొక్కలను విరివిగా నాటారు. అవి ఇప్పుడు కనీసం పది ఫీట్ల వరకు ఏపుగా పెరిగాయి. వాటి కొమ్మలను ప్రతి ఆరు నెలలకోసారి కటింగ్ చేస్తూ వస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొందరు వ్యక్తులు సుమారు 50 కోనోకార్పస్ చెట్లను ఆనవాళ్లు లేకుండా పూర్తిగా నరికేశారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి సూచన మేరకే ఇదంతా చేసినట్లు తెలుస్తోంది. కొమ్మలతో పాటు పెద్ద పెద్ద మండలను మొత్తం అలాగే వదిలేశారు. ఇది గమనించిన మున్సిపల్ సిబ్బంది మంగళవారం ట్రాక్టర్‌తో డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రస్తుతం ఈ ప్రాంతం పచ్చదనం లేక బోసిపోయి కనిపిస్తోంది. ఈ విషయమై ఎంఈ యు.బస్వరాజ్‌ను వివరణ కోరగా అక్కడి చెట్లను నరికివేయడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. త్వరలోనే బాధ్యులను గుర్తించి అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రైలు ఢీ.. రైతు మృతి

మహబూబ్‌నగర్ క్రైం: అర్ధరాత్రి పంట పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన లచ్చిగారి కాశీం (45) మంగళవారం తెల్లవారుజామున వరి పంటకు నీళ్లు పెట్టడానికి పొలానికి వెళ్తూ రైలు పట్టాలను దాటేయత్నం చేశాడు. సరిగ్గా అదే సమయంలో రైలు వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వాల మెడలు వంచాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, సభకు హాజరైన ప్రతినిధులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రైతు వ్యతిరేక ప్రభుత్వాల మెడలు వంచాలని హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర మహాసభల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని సుదర్శన్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రతినిధుల సభకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. దేశం, రాష్ట్రంలో రాజకీయాలు దిగజారిపోయాయన్నారు. రాజకీయాలు మతాలు, ఆవులు, డబ్బుల చుట్టూ తిరుగుతున్నాయని మండిపడ్డారు. నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా నిల్చొబెట్టగా నక్సలైట్ సానుభూతిపరుడని కేంద్ర మంత్రి అమిత్‌షా మాట్లాడటం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాజ్యాంగం, కోర్టులపై అవగాహనలేని వ్యక్తులు సంకుచిత ధోరణితో ఆలోచిస్తారన్నారు. న్యాయవాది దామోదర్‌రావు మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధరలు ఎందుకివ్వరని ప్రశ్నించారు. రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు రాజ్యాం స్థాపన కోసం కృషి చేయాలన్నారు. సీపీఐ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రాంచందర్ మాట్లాడుతూ.. రైతులు సంఘటితంగా లేనందుకే ప్రభుత్వాలు, పెట్టుబడిదారులు మోసం చేస్తున్నారన్నారు. రైతు సంక్షేమాన్ని విస్మరించి ప్రభుత్వాలు పని చేస్తున్నాయని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి ఆరోపించారు. రాబోయే రోజుల్లో పోరాటాలు నిర్వహించేందుకు కార్యోన్ముకులు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఈకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి పద్మ, రామకృష్ణ, జయ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకించాలి


మాట్లాడుతున్న శ్రీజన్ భట్టాచార్య

కొల్లాపూర్: బీజేపీ ప్రభుత్వ విధానాలపై జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నేతలు పోరాటాలు చేస్తుంటే తెలంగాణలో మాత్రం అందుకు విరుద్ధంగా పాలన సాగుతోందని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య ఆరోపించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో భాగంగా మంగళవారం కొల్లాపూర్‌లోని మినీ స్టేడియంలో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ విద్య కాషాయికరణ జరగకుండా అడ్డుకునేందుకు సెక్యులర్ వాదులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిన నూతన విద్యావిధానం–2020ని తెలంగాణలో కూడా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు కనిపిస్తోందన్నారు. ఇంటర్ కళాశాలల ఎత్తివేత ఇందులో భాగమేనన్నారు. పరోక్షంగా కేంద్రం విధానాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థిస్తుందా అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోందన్నారు. బీజేపీ విధానాలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటాలు నిజమైతే వెంటనే నూతన విద్యావిధానాన్ని రద్దుచేసి అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ ప్రకారం శాస్త్రీయ విద్యావిధానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. యూజీసీ గైడ్‌లైన్స్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. సెమినార్‌లో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజనీకాంత్, ఉపాధ్యక్షులు కిరణ్, శంకర్, గర్ల్స్ కన్వీనర్ ఎం.పూజ తోపాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసంగించారు.

సైనిక సంక్షేమంపై న్యాయసేవలు విస్తృతం చేయాలి

● హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్‌సింగ్
● జిల్లా కోర్టులో సైనిక లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం


లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభంలో పాల్గొన్న న్యాయమూర్తులు

పాలమూరు: సైనికుల సంక్షేమంపై న్యాయసేవలను విస్తృతం చేయాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ సూచించారు. హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్యామ్‌కొసి, కార్యదర్శి పంచాక్షరిలతో కలిసి హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ జిల్లాకేంద్రంలోని సైనిక వెల్ఫేర్ జిల్లా కార్యాలయంలో మంగళవారం లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికులు, వితంతువులు, సరీ్వస్‌లో ఉన్న త్రివిధ దళాల సిబ్బంది, అధికారులకు వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల అమల్లో ఎదురవుతున్న న్యాయ సమస్యలపై న్యాయపరమైన సలహాలు, సూచనలు అందించడానికి రాష్ట్రంలో 8 చోట్ల ఈ కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. సైనికుల కుటుంబాల పిల్లలకు స్కూల్ ఫీజు రాయితీ, ఇంటి పన్ను మినహాయింపు, ప్రభుత్వం ఇచ్చిన భూములు, ప్లాట్స్ వద్ద ఎదురవుతున్న సమస్యలపై లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ద్వారా న్యాయ సహాయం పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, సరీ్వస్‌లో ఉన్న త్రివిధ దళాల సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తి ఇందిర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముడా నిధులు పాలమూరుకు రాసిచ్చారు..

మాజీ మంత్రి లక్ష్మారెడ్డిపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ధ్వజం

నవాబుపేట: జడ్చర్లకు రావాల్సిన ముడా నిధులను మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాలమూరుకు రాసిచ్చారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం నవాబుపేటలో కొత్త రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జడ్చర్లకు రావాల్సిన నిధులను పాలమూరుకు అప్పగిస్తూ మాజీ మంత్రి సంతకం చేసిన పత్రాన్ని ఆయన సభలో చూపించారు. తనపై, తన కుటుంబంపై మాజీ మంత్రి వ్యక్తిగత దూషణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కొల్లూరును మండలకేంద్రం చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. యూరియా కోసం బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేస్తున్నది రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా లేదా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపైనా అనేది క్లారిటీ ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, వైస్‌చైర్మన్ తులసీరాం నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, దుశ్యంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, జహీర్, బంగ్లా రవి, భూపాల్‌రెడ్డి, వెంకటేశ్, వాసుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పొలంలో యూరియా చల్లిన ఎమ్మెల్యే



'అంజన్న యూరియా ఎంతకిచ్చారు..యూరియా బాగా చల్లావా..' అంటూ పొలంలో ఓ రైతుతో ఎమ్మెల్యే మాట కలిపాడు. మంగళవారం నవాబుపేట మండలంలో పర్యటించిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చౌడూర్ గ్రామ శివారులో రైతు పొలంలో యూరియా చల్లడం చూసి తన వాహనాన్ని ఆపి పొలంలోకి దిగాడు. రైతు చేతిలో ఉన్న యూరియా గంపను తీసుకుని వరి చేనుకు యూరియా చల్లి రైతు కావలి అంజనేయులుతో మాటలు కలిపారు. ఈ సందర్భంగాగా యూరియా ధర, యూరియా కొరత గురించి రైతును అడిగి తెలుసుకున్నాడు. – నవాబుపేట

ఖమ్మంపై మహబూబ్‌నగర్ భారీ విజయం


విజయం సాధించిన మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని కేసీఆర్–2 మైదానంలో మంగళవారం జరిగిన బి–డివిజన్ టుడే లీగ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 218 పరుగుల తేడాతో ఖమ్మం జట్టుపై విజయం సాధించింది. మొదటి రోజు మహబూబ్‌నగర్ జట్టు 87.1 ఓవర్లలో 331 పరుగులకు ఆలౌట్ అయింది. రెండోరోజు బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం జట్టు జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 35.2 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లు ఎండీ ముఖితుద్దీన్ 8.2 ఓవర్లలో 28 పరుగులు ఇచ్చి 4 వికెట్లు, శశాంక్ 9 ఓవర్లలో 24 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశారు. లీగ్ మ్యాచ్‌లో విజయం సాధించిన జిల్లా జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు. భవిష్యత్‌లో ఇదేవిధంగా సమష్టిగా ఆడి మరిన్ని విజయాలు నమోదు చేయాలని ఆకాంక్షించారు.

రక్షణ చట్టం వెంటనే అమల్లోకి తేవాలి

విధులు బహిష్కరించి నిరసన చేసిన న్యాయవాదులు


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పాలమూరు: రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు రోజురోజుకు చాలా పెరుగుతున్నాయని వీటిని కట్టడి చేయాలంటే న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి తీసుకురావాలని జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు అన్నారు. కూకట్‌పల్లిలో న్యాయవాదిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ఆందోళన చేయడం జరిగింది. ఇటీవల కాలంలో తరచూదాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వాలు అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో న్యాయవాదులపై దాడులు జరిగితే సహించేది లేదన్నారు. ప్రస్తుతం దాడికి కారకులైన వారందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే రిమాండ్‌కు తరలించాలన్నారు. అనంతరం సీనియర్ న్యాయవాదులు ఎన్‌పీ వెంకటేష్, చంద్రమౌళి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన న్యాయవాద వృత్తిలో ఉన్న న్యాయవాదుల పట్ల అమానుషంగా ప్రవర్తించడం సరికాదన్నారు.